సాక్షి నిర్మల్

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



'తెర'మరుగు

సినిమా హాళ్లకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. దీంతో థియేటర్లు మూతపడుతున్నాయి. ఫంక్షన్ హాళ్లుగా, షాపింగ్ హాళ్లుగా మారుతున్నాయి.

8లో▸



ట్రిపుల్ ఐటీ వీసీకి వినతి

బాసర: ఆర్జీయూకేటీలోని గెస్ట్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌కు వినిపత్రం అందించారు. ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
32.1/18.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వేకువజామున చలి ప్రభావం పెరుగుతుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- ఏఎస్పీ అవినాష్ కుమార్



మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఏఎస్పీ

కుంటాల: శాంతి భద్రతల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. కుంటాల పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఠాణా ఆవరణలో మొక్క నాటారు. రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని కోరారు. సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్సై భాస్కరాచారి, ఏఎస్సైలు రాందాస్, జీవన్‌రావు, ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముధోల్ విద్యార్థి



విద్యార్థి అభిషేక్

ముధోల్ : మండల కేంద్రం ముధోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అభిషేక్ అండర్–17 రెజ్లింగ్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు అమీర్ ఖుస్రో, పీడీ శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ బుధవారం నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అభిషేక్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

లక్ష్మణచాంద: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వెళ్లారని వ్యాయాయ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహిస్తున్న అండర్–14, అండర్–17 బాలుర రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లినట్లు వివరించారు. అండర్–14 పోటీలకు రాథోడ్ అవిష్, ఎస్‌కే.తన్వీర్, జాదవ్ విక్రం, అండర్–17 పోటీలకు కె.వంశీ ఎంపికైనట్లు తెలిపారు.

నేటినుంచి ఆయుత చండీయాగం



సిద్ధమైన యాగశాల

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయం సమీపంలో శ్రీవైష్ణవ ఆయుత చండీయాగం శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు చేశారు. శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూప నందస్వామి పర్యవేక్షణలో ఈనెల 25 వరకు ఈ యాగం నిర్వహిస్తారు. ఈ యాగంలో ప్రతీరోజు 1,100 మంది రిత్వికులు పాల్గొంటారు. 5 వేల మందికి అన్న ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేశారు. ప్రపంచ శాంతి కోసం ఈ యాగం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో కుంకుమార్చన, లక్ష దీపోత్సవం, లక్ష్మీనరసింహ, వేణుగోపాలస్వామి, సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్యస్వామి, సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.

మహారాష్ట్ర సరిహద్దులో పులి



సరిహద్దులో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు

కుంటాల: పది రోజులుగా జిల్లాలో తిరుగుతున్న పెద్దపులి.. గురువారం మహారాష్ట్రలోని అపాపరావుపేట రేంజ్ పంగర్‌పాడ్ అటవీ ప్రాంతానికి వెళ్లినట్లు రెండు రాష్ట్రాల అటవీ అధికారులు గుర్తించారు. పులికి రెండు రాష్ట్రాల అటవీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్, డీఆర్‌వో రేష్మ, ఎఫ్ఎస్‌వోలు కీర్తిరెడ్డి, పూర్ణిమ, మల్లేశ్, ఎఫ్‌బీవోలు హరిలత, రఘునాథ్, కృష్ణ పులి పాద ముద్రలు గుర్తించారు.

నేడు కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: విశ్రాంత ఉద్యోగుల సంఘం, గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ.లింగన్న తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మేడం రా సార్ పో లేదు!

- బాధ్యతలు చేపట్టని కొత్త డీఈవో
- జిల్లాకు రావడానికి విముఖత..!
- బదిలీ అయినా.. రిలీవ్ కానీ రవీందర్‌రెడ్డి
- స్పెషల్ టీచర్ల కౌన్సెలింగ్‌పై ఆరోపణలు
- విద్యాశాఖలో ఏం జరుగుతోంది..!?



నాగజ్యోతి రవీందర్‌రెడ్డి

నిర్మల్: జిల్లా విద్యాశాఖ అధికారి(ఎఫ్ఏసీ)గా ఉన్న రవీందర్‌రెడ్డిని మహబూబాబాద్‌కు బదిలీ చేస్తూ ఈనెల 4న విద్యాశాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ ఆయన ఇప్పటికీ జిల్లాలోనే ఉన్నారు. ఇక జిల్లాకు కొత్త డీఈవోగా నాగజ్యోతిని నియమించారు. ఆమె కూడా ఇప్పటికీ బాధ్యతలు తీసుకోలేదు. నాగజ్యోతి రాకపోవడం.. రవీందర్ రెడ్డి జిల్లాను వీడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తక్షణ బదిలీ కింద వీరిని చేసినప్పటికీ ఎవరి స్థానాల్లో వారు కొనసాగుతూనే ఉండటం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది. మరోవైపు జిల్లాలో ప్రత్యేక టీచర్ల నియామకం తీరుపైనా పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

కొత్త డీఈవో విముఖత..

నిజామాబాద్ జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నాగజ్యోతిని నిర్మల్ డీఈవో(ఫుల్ అడిషనల్ చార్జి)గా బదిలీ చేశారు. కానీ సదరు అధికారి జిల్లాకు రావడానికి విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. కొన్నేళ్లుగా నిజామాబాద్‌లోనే చేస్తున్న ఆమె వ్యక్తిగత కారణాలతో నిర్మల్ రావడానికి సుముఖంగా లేరని సమాచారం. మరోవైపు ఇటీవల కాలంలో జిల్లాలో విద్యాశాఖ సంచలనాలకు కేరాఫ్‌గా మారిన విషయమూ తెలిసింది. యూబిట్ కేసులో కూరుకుపోయిన వారిలో అధిక శాతం ఉపాధ్యాయులే ఉన్నారు. వీరిలో చాలామంది విదేశాలకు వెళ్లడానికి శాఖాధికారులు ఇష్టారీతిన పర్మిషన్లు ఇచ్చినట్లు ఆరోపణలూ ఉన్నాయి. ఈ కేసులోకి ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్)కూడా ఎంటర్ కావడం కీలకంగా మారింది.

రిలీవ్‌కాని రవీందర్‌రెడ్డి..

కొత్త డీఈవో నాగజ్యోతి జిల్లాకు రాకపోవడం, ఇక్కడ బాధ్యతలు చేపట్టకపోవడంతో పాత డీఈవో రవీందర్‌రెడ్డి ఇంకా జిల్లాలోనే ఉన్నారు. మహబూబాబాద్ బదిలీ అయినట్లు ఆర్డర్ వచ్చినా ఇక్కడే కొనసాగుతున్నారు. నాగజ్యోతి బాధ్యతలు చేపట్టనందునే తాను జిల్లా నుంచి రిలీవ్ కావడం లేదని, కలెక్టర్ సైతం కొత్త డీఈవో వచ్చిన తర్వాతనే రిలీవ్ కావాలని చెప్పినట్లు తెలిసింది. కానీ.. రవీందర్‌రెడ్డి సైతం మహబూబాబాద్ వెళ్లడానికి కొంత విముఖంగానే ఉన్నట్లు సమాచారం. గతంలో ఆయన మహబూబాబాద్ డిప్యూటీ డీఈవోగా చేశారు. అప్పట్లో ఆయనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన ఆ జిల్లాకు వెళ్లడానికి వెనుకాడుతున్నట్లు చెబుతున్నారు.

గాడిన పడని వ్యవస్థ..

జిల్లాలో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచీ ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది. ప్రధానంగా యూబిట్ దందాలో ఉపాధ్యాయులు భారీసంఖ్యలో ఉండటంతో పలువురు జైలుకు వెళ్లి సస్పెండ్ కావడం తెలిసిందే. ఈ కాయిన్ దందా వ్యవహారంలో కొంతమంది ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా దేశం దాటి విదేశాలకు వెళ్లారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా వెళ్లడానికి జిల్లా అధికారులు సహకరించారన్న ఆరోపణలూ వచ్చాయి. ఇక ఈ కేసు ఈడీ విచారణ ప్రారంభించిన తర్వాత ఎటు దారితీస్తుందోనన్న అనుమానాలూ ఉన్నాయి. జిల్లా విద్యాశాఖలో లైవ్‌లొకేషన్ వ్యవస్థనూ పూర్తిగా నీరుగార్చారని, ప్రస్తుతం చాలామంది ఉపాధ్యాయులు ఇష్టారీతిన బడికి వెళ్లడం, రావడం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

'ప్రత్యేక' అనుమానాలు..!

జిల్లా విద్యాశాఖ అధికారి బదిలీకి ఒక్కరోజు ముందే ఆగమేఘాల మీద స్పెషల్ టీచర్ల కౌన్సెలింగ్ చేపట్టడమూ అనుమానాలకు తావిస్తోంది. ఈనెల 2న మధ్యాహ్నం ఉత్తర్వులు రాగా, రాత్రి వరకూ చేపట్టిన తీరుపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని, పోస్టింగ్‌ల విషయాన్ని ఇప్పటికీ మీడియాకు వెల్లడించకపోవడం గమనార్హం. ఈ విషయంపై వివరాలు అడిగితే విద్యాశాఖ అధికారులు సమాధానం దాటవేయడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

గ్రిల్ 9 హోటల్ సీజ్



వంటలకోసం ఉపయోగించే పాత్రలను చూపుతూ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారి



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రత్యూష



గ్రిల్ 9 హోటల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

- తనిఖీల్లో బయటపడ్డ కాలం చెల్లిన పదార్థాలు

నిర్మల్‌టౌన్: ఈనెల 2, 3వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని గ్రిల్ 9 హోటల్లో భోజనం చేసిన పలువురికి ఫుడ్ పాయిజన్ అయింది. సుమారు 50 మంది అస్వస్థతకు గురయ్యారు. ఒకరు మృతిచెందారు. దీంతో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ గురువారం తనిఖీలు చేశారు. వంటగదిని, వస్తువులు, పదార్థాలను పరిశీలించారు. కాలం చెల్లిన వస్తువులను, శుభ్రత లోపాలను గుర్తించారు. ఫుడ్ పాయిజన్ కావడానికి కారణాలను హోటల్ యజమానికి అడిగి తెలుసుకున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలంచెల్లిన వస్తువులనీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పలువురు బాధితులు హోటల్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. గ్రిల్ 9 హోటల్లో ఈ నెల 2, 3 తేదీల్లో భోజనం చేసినవారందరికీ ఫుడ్‌పాయిజన్ అయిందని తెలిపారు. దీంతో నాలుగు రోజుల నుంచి హోటల్ నిర్వాహకులు అందుబాటులో లేరన్నారు. వారిని పోలీసుల సహాయంతో పిలిపించామన్నారు. హోటల్ లోపలికి వెళ్లి తనిఖీ చేయగా.. రీయూస్డ్ ఆయిల్, అపరిశుభ్రత, కాలం చెల్లిన పదార్థాలు కనిపించాయి. అంతేకాకుండా సీసీ టీవీ ఫుటేజీని తొలగించారని తెలిపారు. ఈ హోటల్ యజమానికి వారం క్రితమే నియమ, నిబంధనలు తెలిపామన్నారు. లైసెన్స్ గడువు ముగియడంతో .. రెన్యువల్ చేసుకోమని చెప్పామన్నారు. ఈ హోటల్‌లో ప్రభుత్వం బ్యాన్ చేసిన మయోనైజ్ వాడుతున్నారన్నారు. దీంతో ఆరోజు హోటల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ మయోనైజ్ తీసుకున్నారని తెలియజేశారు. దీంతో చాలామంది అస్వస్థతకు గురయ్యారని, ఒకరు మరణించారని తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు హోటల్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హోటల్‌ను సీజ్ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిషేధించిన పదార్థాలను హోటళ్ల యజమానులు వాడకూడదని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

- ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

నిర్మల్‌టౌన్: హోటళ్లు, రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్‌లో కిరణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు, హోటళ్లు, రెస్టారెంట్‌ల యజమానులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ విషయంలో ప్రతి ఒక్క రూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశంలో రాజీపడొద్దని, రూల్స్ ప్రకారం బిజినెస్ చేయాలని సూచించారు. పరిసరాలను క్లీన్‌గా ఉంచుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ప్రజలకు అందించే ఆహార పదార్థాలు కల్తీ లేకుండా ఆరోగ్యకరంగా.. శుభ్రంగా.. ఉండేలా చూసుకోవాలన్నారు. తాజా ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలని తెలిపారు. ఇకపై ఆకస్మిక దాడులు జరుగుతూనే ఉంటాయన్నారు. ఆహార పదార్థాల విక్రయదారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, హోటల్, రెస్టారెంట్, కిరణ దుకాణాలు, సూపర్ మార్కెట్ యజమానులు పాల్గొన్నారు.

విధ్వంస మాఫియాను అరికట్టాలి

- నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణికి వివరించిన రైతులు



వాగులో ఇసుక తవ్విన ప్రాంతం పరిశీలిస్తున్న ఆర్డీవో



ఆర్డీవోకు మాఫియా ఆగడాలు వివరిస్తున్న రైతులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఇసుక, మొరం పేరుతో విధ్వంసానికి పాల్పడుతున్న మాఫియాను అరికట్టాలని పలువురు రైతులు, పట్టణవాసులు నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణిని కోరారు. పట్టణంలో అక్రమంగా సాగుతున్న ఇసుక, మొరం దందా ప్రాంతాలను ఆర్డీవో గురువారం తనిఖీ చేశారు. పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో 110 ఎకరాల ప్రభుత్వ భూముల్లో చెట్లను కూల్చివేసి మొరం తవ్వకాలు చేస్తున్నారని రైతులు నర్సయ్య, రాజేందర్, అఖిల్ తదితరులు ఆర్డీవోకు వివరించారు. సరస్వతి కాలువ పరిధిలోని డిస్టిబ్యూటరీ 27 ఉప కాలువలను సైతం ధ్వంసం చేసి మొరం దందా చేస్తున్నారని తెలిపారు. మొరం తవ్వకాలతో ఈ ప్రాంతమంతా లోయలుగా, గుంతలుగా మారి ప్రమాదకరంగా తయారైందని తెలిపారు. అర్ధరాత్రి కూడా తవ్వకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై అడిగేందుకు వెళితే దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తే తప్ప ఈ దందాలను అరికట్టలేమని తహసీల్దార్ ఆర్డీవోకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పలు ఇసుక డంప్‌లను సీజ్ చేయాలని మైనింగ్ ఆర్ఐ ఆనంద్, తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం మొరం తవ్వకాల ప్రాంతంతోపాటు రెంకోని వాగులో ఇటీవల బావిని తలపించేలా జరిపిన ఇసుక తవ్వకాలను పరిశీలించారు. ఈ నివేదికను కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ తరలిస్తేనే సర్వేకు సహకరిస్తాం

- కుటుంబ సర్వే వద్దంటూ మహిళల వినతి



సర్వే వద్దంటూ వినతిపత్రం ఇస్తున్న మహిళలు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మించే ఇథనాల్ ఫ్యాక్టరీని ఇక్కడి నుంచి తరలిస్తేనే ఇంటింటి సర్వేకు సహకరిస్తమని రెండు గ్రామాల ప్రజలు తేల్చి చెప్పారు. సర్వేను గురువారం రెండు గ్రామాల ప్రజలు బహిష్కరించారు. తమ గ్రామం వ్యవసాయానికి ఎంతో ప్రసిద్ధని, ఇక్కడ పండించే పంటలను చూసేందుకు శాస్త్రవేత్తలు వివిధ ప్రాంతాలకు చెందిన రైతులను ఇక్కడికి తీసుకువచ్చారని తెలిపారు. ఇక్కడి పంటలపై అవగాహన కల్పించి తమ గ్రామాల ఖ్యాతిని తెలియజేశారని పేర్కొన్నారు. ఇలాంటి భూముల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలంటూ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ తరలించే వరకు పోరాటం కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను బహిష్కరిస్తామని, అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

108వ రోజుకు దీక్షలు

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు చేపట్టిన దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం నాటికి 108వ రోజుకు చేరకున్నారు. మున్నూరు కాపు యువత దీక్ష చేశారు. పచ్చని పంటచేలను నాశనం చేసే ఇథనాల్ ఫ్యాక్టరీ తమకు వద్దంటూ నినాదాలు చేశారు. ఫ్యాక్టరీని ఇక్కడి నుండి తరలించాలని కోరారు.

త్వరలోనే కాంటాలకు స్టాంపింగ్

- తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయసారథి



తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారులు

భైంసాటౌన్: ఎలక్ట్రానిక్, మాన్యువల్ కాంటాలన్నింటికీ త్వరలోనే స్టాంపింగ్ చేస్తామని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయసారథి తెలిపారు. జిల్లా అధికారి భూలక్ష్మితో కలిసి పట్టణంలోని గాంధీగంజ్‌లో కిరాణదుకాణాల్లో కాంటాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాంపింగ్ లేని, గడువు ముగిసిన కాంటాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దుకాణదారులకు రూ.25 వేల వరకు జరిమానా విధించారు. కానీ, కాంటాల స్టాంపింగ్ కోసం ఏడాది కిందట కాంటా రిపేరర్ డబ్బులు తీసుకెళ్లారని, ఎన్నిసార్లు ఫోన్‌లో సంప్రదించినా స్పందించలేదని వ్యాపారులు అధికారుల దృష్టికి తెచ్చారు. తమ తప్పేమీ లేకున్నా జరిమానాలు విధించడమేంటని నిలదీశారు. ఏటా స్టాంపింగ్ పేరిట డబ్బులు తీసుకెళ్తున్నారని, రిపేరర్లు చేయకుండా, స్టాంపింగ్ చేయకుండా వదిలేస్తున్నారని తెలిపారు. స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ కాంటా మెకానిక్‌పై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తనిఖీలకు వచ్చి.. స్టాంపింగ్ మరచి..

ఇదిలా ఉండగా, భైంసా పట్టణంలోని పలు కిరాణ దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాంటాల తనిఖీలకు వచ్చిన తూనికలు, కొలతల శాఖ అధికారులు ఇదివరకే సీల్ పూర్తయిన కాంటాలకు స్టాంపింగ్ వేయకుండానే వెళ్లిపోయారు. స్థానిక గాంధీగంజ్‌లోని ట్రేడర్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ కాంటాలకు స్టాంపింగ్ కోసం ఓ గుత్తేదారు గతనెలలో డబ్బులు తీసుకుని సీల్ వేశాడు. వాటికి తూనికలు, కొలతల శాఖ అధికారులు స్టాంపింగ్ వేయాల్సి ఉండగా, భైంసాకు వచ్చినా స్టాంపింగ్ వేయలేదు. ఈ విషయమై సదరు అధికారిని వివరణ కోరగా, తమ శాఖలోని ఓ ఉద్యోగి అస్వస్థకు గురికావడంతో స్టాంపింగ్‌లో జాప్యమైందని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



పీచరలో కొనుగోళ్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

లక్ష్మణచాంద: వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పీచర గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ధాన్యం తూకం వేసిన తర్వాత రైతులకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలని సూచించారు. ధాన్యం తూకం అనంతరం రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనం తయారుచేసి అందజేయాలన్నారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక కుటుంబ సర్వేను పరిశీలించారు. తర్వాత పొట్టపెల్లి(కే) గ్రామంలోని గోదాంను పరిశీలించారు. గోదాం వద్ద తేమను పరిశీలించడానికి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సివిల్ సప్లయ్ అధికారులకు సూచించారు. గోదాము వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వ భూమిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి సర్వే చేయడం లేదని వీడీసీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే ఆర్డీవో ద్వారా తహసీల్దార్ రిపోర్టు అందజేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని కనకాపూర్ గ్రామంలో ఇటుక బట్టీలతో పొగ వస్తుందని దీంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యా దు చేయగా, స్పందించిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఏవో అంజిప్రసాద్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, ఏవో వసంత్‌రావు, ఎంపీవో అమీర్‌ఖాన్ ఉన్నారు.

పౌర సేవల ధ్రువపత్రాలు త్వరగా జారీ చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: పౌర సేవల ధ్రువీకరణ పత్రాలు త్వరగా జారీ చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న పౌర సేవల గుర్తింపు పత్రాల దరఖాస్తులు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులకు సంబంధించిన కోర్టు కేసు వివరాలపై ఆ రా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌర సేవలకు గుర్తింపు పత్రాల జారీలో జాప్యం చేయొద్దన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తు పత్రాలను వెంటనే పరిశీలించాలన్నారు. మండలాలకు సంబంధించిన పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు, ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఉండేవిధంగా చూడాలన్నారు. ధా న్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు తనిఖీ చేయాలన్నారు. అన్ని మండలాల పరిధిలోని ప్ర భుత్వ భూములకు సంబంధించిన వివరాలు అందించాలని సూచించారు. సంబంధిత అధికారులతో భూముల సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించా లని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఈడీఎం నదీమ్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలస్థాయి చెకుముకి పరీక్షలు షురూ..



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్ రూరల్: జిల్లాలో పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 200 పాఠశాలల్లో పది వేల మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒకరి చొప్పున 200 మందిని మండల స్థాయికి ఎంపిక చేస్తారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలతో విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం పెరుగుతుందని అధికారులు తెలిపారు. పరిశోధనా శక్తిని పెంపొందించి, ప్రకృతిలో జరిగే విషయాలను అర్థం చేసుకుంటారని, సమకాలీన సామాజిక పరిణామాలు అర్థం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగడానికి దోహనం చేస్తాయని వివరించారు.

అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌టౌన్: పూలే, అంబేద్కర్ సేవారత్న అవా ర్డులకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని బ హుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు నిగులపు లింగన్న, జిల్లా అధ్యక్షుడు తలారి రాజేశ్వర్ తెలిపారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. ఢిల్లీలో నిర్వహించే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగో నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందులో పాల్గొనాలనుకునేవారు 95055 63910, 99634 97446 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..'

- ఆత్మహత్యాయత్నం చేసిన కుటుంబానికి ఎస్పీ భరోసా



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన అనురాధ భర్త వేణు, కూతురు పూర్ణిమతో కలిసి బాసర గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో భర్త మృతి చెందాడు. కూతురు గల్లంతు కాగా, అనురాధ పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేను ఎస్పీ జానకీ షర్మిల గురువారం పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అప్పు కట్టాలని వేధించిన వడ్డీ వ్యాపారుల కోసం పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

గల్లంతైన యువతి మృతదేహం లభ్యం



పూర్ణిమ(ఫైల్)

బాసర: అప్పుల బాధ, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ కుటుంబం బుధవారం బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వి షయం తెలిసిందే. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్‌లోని న్యాల్‌కల్‌కు చెందిన వేణు మృతిచెందగా, భార్య అనురాధ ప్రాణాలతో బయటపడింది. కుమార్తె పూర్ణిమ గల్లంతైంది. గురువారం ఉదయం పోలీసులు గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం తల్లికి అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

రోడ్లపై ధాన్యం పోసిన రైతుపై కేసు

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన పవార్ టీకారాం అనే రైతు సేవాలాల్ తండా- భైంసా రోడ్డుపై వరిధాన్యం ఆరబోశాడు. రాళ్లు పెట్టడంతో వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. లోకేశ్వరం నుంచి భైంసాకు వెళ్లే రహదారిపై సేవాలాల్ తండాకు చెందిన రైతు పవార్ టీకారాం రోడ్డుపై వరి ధాన్యం పోయడంతో బుధవారం రాత్రి రాయాపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన జాదవ్ విరాబాయి-వెంకటేశ్ దంపతులు కిందపడి గాయపడ్డారు. వెంటనే దంపతులను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్సపొందుతున్నారు. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పవార్ టీకారాంపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బాసరకు చేరిన రథయాత్ర



స్వాగతం పలుకుతున్న అర్చకులు

బాసర: కంచి కామకోటి పీఠం నుంచి అయోధ్యకు వెళ్తున్న శ్రీరామ రథయాత్ర గురువారం బాసరకు చేరుకుంది. అర్చకులు, ఆలయ వైదిక సభ్యులు రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించారు.

'తెర'మరుగు

- నిర్మల్ జిల్లాలో పలు థియేటర్లు మూసివేత
- జనం లేక నిర్వహణ భారంతో..
- వాటిని కూల్చేసి ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాళ్లు ఏర్పాటు
- ఇంట్లోనే మినీ థియేటర్, ఎల్ఈడీ తెరలు



ఫంక్షన్‌హాల్‌గా మారిన నటరాజ్ థియేటర్(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండుగ వాతావరణం ఉండేది. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల వేళ కొత్త సినిమాలతో కోలాహలం అంతా ఇంతా కాదు. గ్రామీణ, పట్టణాల నుంచి కుటుంబాలతో తరలివచ్చి సినిమాలు చూసేవారు. ప్రస్తుతం పెద్దహీరోల సినిమాలకు తప్ప జనం థియేటర్లకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో వాటిని కూల్చేసి ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాల్స్‌గా ఏర్పాటు చేస్తున్నారు. వాణిజ్య స్థలాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో బహుళ వ్యాపార సముదాయాలుగా పునర్నిర్మిస్తున్నారు.

షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లుగా..

జిల్లాకేంద్రంతోపాటు భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీ కేంద్రాలు ఉన్నాయి. నిర్మల్‌లో గతంలో ఐదు సినిమా థియేటర్లు ఉండేవి. ప్రస్తుతం రెండు నిర్వహణలో ఉండగా మిగతావి షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లుగా రూపాంతరం చెందాయి. నిర్మల్‌లో కమల్ థియేటర్ ఇప్పటికే నివాస సముదాయంగా, గతంలో ఉన్న అశోక థియేటర్ ప్రస్తుతం షాపింగ్ మెగామార్ట్‌గా మారింది. ఒకప్పుడు ప్రేక్షకులతో కిక్కిరిసిపోయే వెంకటేశ థియేటర్ రెండేళ్లక్రితం కూల్చేశారు. నూతనంగా బహుళ వ్యాపార సముదాయం నిర్మించనున్నారు. శివాజీచౌక్ సమీపంలో నటరాజ్ థియేటర్ కన్వెన్షన్ హాల్‌గా మారిపోయింది. జిల్లా కేంద్రంలో నారాయణ, తిరుమల థియేటర్లు అందుబాటులో ఉన్నాయి.

నిర్వహణ భారంతో..

గతంలో ప్రేక్షకులతో కిక్కిరిసిన ఖానాపూర్‌లోని ఏకైక థియేటర్ లక్ష్మీ టాకీస్. జనం లేక వెలవెలబోతున్న నేపథ్యంలో నిర్వహణ భారంగా మారడంతో కూల్చివేశారు. దాని స్థానంలో వాణిజ్య సముదాయాలు నిర్మించే పనిలో ఉన్నారు. భైంసాలోని కమల థియేటర్ ప్రస్తుతం మనుగడలో ఉన్నా పెద్దగా గిట్టుబాటు లేకుండా ఉందని యజమానులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.



జిల్లాకేంద్రంలోని ఓ థియేటర్

ఇంట్లోనే తెరలు ఏర్పాటు

ప్రస్తుతం ఓటీటీల కాలం వచ్చేసింది. కుటుంబ సమేతంగా ఇంట్లోనే భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి కొత్త సినిమాలు వీక్షిస్తున్నారు. ఉన్నతవర్గాల వారు ఇంట్లోనే మినీ థియేటర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. నిర్మల్‌లో దాదాపు ఇలాంటి తెరలను నిర్మించుకున్న వారు వందల సంఖ్యలో ఉన్నట్లు టెక్నీషియన్లు చెబుతున్నారు.

ఆసక్తి చూపడం లేదు



సినిమా వీక్షించడానికి గతంలో కుటుంబంతో కలిసి వెళ్లేవారు. చిన్నప్పుడు ఎడ్లబండిపై వెళ్లేవాడిని. ప్రస్తుతం ఓటీటీల్లో కొత్త సినిమాలు వచ్చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా థియేటర్లకు రావడానికి జనం ఆసక్తి చూపడం లేదు. మునుపటిలా అవి మనుగడ సాగించలేకపోతున్నాయి.

– టి.సంపత్ కుమార్, సీనియర్ సిటిజన్, నిర్మల్

ప్రేక్షకుల సంఖ్య తగ్గింది



గతంలో కంటే ఇప్పుడు థియేటర్‌కు వచ్చి సినిమాలు చూసే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. పెద్ద హీరోల సినిమాలకు ఇప్పటికి హంగామా ఉంటుంది. విడుదలైన రోజు నుంచి వారంలో సినిమా చూసే అభిమానులు ఉన్నారు.

– వసంత్ రాథోడ్, సినీ అభిమాని, నిర్మల్

'డిస్ట్రిబ్యూషన్' తరలింపు!

- మంచిర్యాల నుంచి కాజీపేటకు..
- షిఫ్ట్ చేసేలా తపాలాశాఖ యోచన
- సత్వర సేవలకు అంతరాయం
- ఇక్కడే కొనసాగించాలని ప్రజల అభ్యర్థన



జిల్లాకేంద్రంలోని సార్టింగ్ కార్యాలయం (రైల్వేమెయిల్ సర్వీస్)

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని రైల్వేమెయిల్ సర్వీస్, సార్టింగ్ (డిస్ట్రిబ్యూషన్) కార్యాలయాన్ని కాజీపేటకు తరలించేందుకు తపాలాశాఖ యోచిస్తోంది. అక్కడి స్పీడ్‌పోస్టు కార్యాలయంలో విలీనానికి కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏకైక సార్టింగ్ కార్యాలయం మంచిర్యాలలో ఉంది. జిల్లాలకు చెందిన పార్సిళ్లు, ఉత్తరాలను ఇతర ప్రాంతాలకు చేరవేయడానికి రైలుమార్గం ఉన్న మంచిర్యాలలో 1986లో దీన్ని ఏర్పాటు చేశారు. 2016 వరకు సేవలు సజావుగా కొనసాగాయి. ఇక్కడ ఉన్న స్పీడ్‌పోస్టు కార్యాలయాన్ని 2016లో వరంగల్‌కు తరలించారు. దీంతో స్పీడ్‌పోస్టు ఉత్తరాల బట్వాడా వరంగల్ నంచి కొనసాగుతోంది. దీంతో ఒక్కరోజు అందే ఉత్తరం మూడురోజులు ఆలస్యంగా అందుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్లు సైతం ఆలస్యంగా అందిన ఘటనలున్నాయి.

విలీనానికి మొగ్గు..

ఉద్యోగులను కుదించాలని, ఖర్చులు తక్కువ చేసుకోవాలనే ఉద్దేశంతో తపాలాశాఖ ఈ విలీనానికి మొగ్గుచూపుతోంది. దీంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. విలీన ప్రక్రియ వద్దని హైదరాబాద్‌లోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయ సూపరింటెంటెండ్‌కు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జిల్లాల్లో ఇప్పటివరకు ఉత్తరాలు, పార్శిళ్ల కొరియర్ సేవలను తపాలా ద్వారా పంపిస్తున్నారు. ఈ తరహా సేవలు లేకపోతే ప్రజలు ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్ఎంఎస్, సార్టింగ్ కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మంచిర్యాల నుంచి రైల్వేమెయిల్ సర్వీస్, సార్టింగ్ కార్యాలయం తరలిపోకుండా తపాలా శాఖ అధికారులతో మాట్లాడతాను. ప్రజలకు సేవలందించే కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

– గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎంపీ

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు



ట్రోఫీ అందుకుంటున్న భద్రాచలం జట్టు



ట్రోఫీ అందుకుంటున్న ఉట్నూర్ జట్టు

- ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన భద్రాచలం జట్టు
- ద్వితీయస్థానంలో నిలిచిన ఉట్నూర్ జట్టు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 5వ గిరిజన క్రీడోత్సవాలు గురువారంతో ముగిశాయి. హోరాహోరీగా సాగిన అథ్లెటిక్స్ పోటీల్లో భద్రాచలం జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా ఉట్నూర్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీల్లో 1600 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణించేందుకు అన్నిరకాల సహకారాలు అందిస్తామన్నారు. పీవో మాట్లాడుతూ క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు వరంగల్ జిల్లాకు చెందిన వెంకట నారాయణను సన్మానించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో పార్థసారథి, నిర్మల్ జిల్లా గిరిజన క్రీడల అధికారి రమేశ్, ఆయా జిల్లాల పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యాయత్నం
- న్యూలింగంపల్లిలో ఘటన



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ గంగారెడ్డి

మామడ: వరకట్న వేధింపులకు వివాహిత బలైంది. భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని న్యూలింగంపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని న్యూలింగంపల్లికి చెందిన దేవరశెట్టి నవీన్‌కు నిజామాబాద్ జిల్లా బాద్గుణకు చెందిన వికాసిని(24)తో 2019లో వివాహమైంది. రూ.3 లక్షల నగదు, రెండు తులాల బంగారం కట్నకానుకలు అందించారు. ఈ దంపతులకు 5, 3 ఏళ్లలోపు ఇద్దరు కుమార్తెలు, 6 నెలల కుమారుడు ఉన్నారు. నవీన్ వడ్రంగి పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రూ.50 వేలు అదనపు కట్నం తేవాలని కొంతకాలంగా భార్యను వేధించసాగాడు. ఈ విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇరుపెద్దలు నవీన్‌కు నచ్చజెప్పారు. కొన్నిరోజులుగా వీరి కాపురం సజావుగా సాగింది. కొంతకాలం తర్వాత కట్నం తేవాలని భార్యను శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. గురువారం ఉదయం నవీన్ పనికి వెళ్లగా కుమార్తె పాఠశాలకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వికాసిని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పిల్లల ఏడుపులు విని కాలనీవాసులు అక్కడికి వెళ్లగా వికాసిని ఉరేసుకుని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సందీప్ పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, భార్య ఉరేసుకున్న విషయం తెలియడంతో భర్త గ్రామంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతన్ని అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.



వికాసిని (ఫైల్)

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం ..జిల్లాకేంద్రంలోని పొట్టిశ్రీరాములు చౌక్ ప్రాంతంలో జంజిరాల భిక్షపతి కుమారుడు రాజశేఖర్(22) నివాసం ఉంటున్నాడు. ఏడాదిగా పనిలేక ఖాళీగా ఉన్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రులకు వెళ్లిన కోలుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రేరేపించడంతోనే రైతు ఆత్మహత్యాయత్నం

- బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగారెడ్డి



మాట్లాడుతున్న గంగారెడ్డి

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన సోయా రైతు మోహన్ రెడ్డిని ఈ నెల 6న కొంతమంది కావాలనే ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించారని బోథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురుగుల మందు డబ్బాతో ఉద్దేశపూర్వకంగా ఆందోళన నిర్వహించారని, విషయాన్ని సదరు రైతే తనకు చెప్పాడన్నారు. ఒకవేళ పురుగుల మందు తాగితే రైతు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని బదనాం చేయడానికే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారన్నారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతీగింజను కొంటామన్నారు. మార్కెట్‌లో లోడింగ్ సమస్య, సంచుల కుట్టుమిషన్ పనిచేయకపోవడంతోనే సోయా కొనుగోళ్లలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. హమాలీల సంఖ్యను పెంచి, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా చూస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

తుదిదశకు ఉద్యోగ ప్రక్రియ

- 2008 డీఎస్సీ అభ్యర్థులకు తాత్కాలిక పద్ధతిన కొలువు
- మరోసారి వివరాలు పరిశీలించిన ఉన్నతాధికారులు



ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: 2008 డీఎస్సీ అన్ సక్సెస్‌ఫుల్ అభ్యర్థుల తాత్కాలిక ఉద్యోగ ప్రక్రియ తుదిదశకు వచ్చింది. ఇప్పటికే అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన విద్యాశాఖాధికారులు మరోసారి పరిశీలన చేపట్టారు. గురువారం వరంగల్ ఆర్జేడీ, అబ్జర్వర్ సత్యనారాయణరెడ్డి డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. 2008 డీఎస్సీలో 70:30 లిస్టులో పేర్లు ఉండి ఉద్యోగం పొందని బీఎడ్ అభ్యర్థులకు ఇటీవల ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిన ఉద్యోగం కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 135 మంది అభ్యర్థులు ఉన్నట్లు విద్యా శాఖాధికారులు గుర్తించారు. ఇటీవల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టగా ఆదిలాబాద్ నుంచి 13 మంది, కుమురం భీం ఆసిఫాబాద్ నుంచి 10, మంచిర్యాల నుంచి 26, నిర్మల్ నుంచి 15 మంది అభ్యర్థులు హాజరయ్యారని, ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు డీఎడ్ అభ్యర్థులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే డీఎస్సీ 2008 లిస్టులో 30 శాతం తొలగించబడిన బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారికి ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిన ఉద్యోగం కల్పించనుంది. 16 సంవత్సరాల తర్వాత బీఎడ్ అభ్యర్థులకు కొలువులు దక్కనున్నాయి. పరిశీలన కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సూపరింటెండెంట్లు భోజన్న, మమత, విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది శ్రీహరిబాబు, తుషార్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బర్రెల మందపై చిరుతపులి దాడి



పెద్దపులి అడుగులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ముల్కల్ల శివారులోని ర్యాలీవాగు ప్రాజెక్ట్ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన బర్రెల మందపై బుధవారం సాయంత్రం చిరుతపులి దాడి చేసింది. రాదండ్ల ఓదమ్మకు చెందిన ఓ బర్రె గాయపడింది. అటవీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రల ఆధారంగా చిరుతపులి దాడిగా పేర్కొంటున్నారు. కాగా, పులి దాడి చేసినట్లుగా పశు యజమానులు చెబుతున్నారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థికి తీవ్రగాయాలు



వీరేందర్‌ను ఆస్పత్రికి తీసుకువస్తున్న స్థానికులు

ఇంద్రవెల్లి: విద్యుత్‌షాక్‌తో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రంలోని పూలా జీబాబానగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు..మండలకేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన మసురే సంతోష్-సుకేష్మ దంపతుల కుమారుడు వీరేందర్. జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం బడికి వెళ్లి మధ్యలో తోటి విద్యార్థులతో కలిసి ఆడుకునేందుకు పూలాజీబాబానగర్ వెళ్లాడు. అక్కడ ఆడుతుండగా ఓ భవనం ఎక్కి వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. తోటి విద్యార్థులు గమనించి కర్రలతో కొట్టి అతన్ని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. వీరేందర్ పరిస్థితి కొంత విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణమంటూ పీహెచ్‌సీ, జెడ్పీ పాఠశాల వద్ద కుటుంబీకులు, కాలనీవాసులు, యువకులు ఆందోళన చేపట్టారు. విద్యుత్ తీగలు వేలాడుతున్న విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థిని రిమ్స్‌కు తరలించిన అనంతరం జెడ్పీ పా ఠశాలకు వెళ్లిన కుటుంబసభ్యులు, కాలనీవాసులు హెచ్‌ఎం, ఉపాధ్యాయులను నిలదీశారు. బడి సమయంలో విద్యార్థులు బయటకు వెళ్తున్నా పట్టించుకోని ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత



విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్-17 బాలుర హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో వరంగల్ జట్టుపై 3-0 గోల్స్ తేడాతో సత్తాచాటి విజేతగా నిలిచిందని సెక్రెటరీ కాంతారావు తెలిపారు. జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి తదితరులు గురువారం జట్టుకు అభినందనలు తెలిపారు.

ఒకరిని గాయపర్చిన కేసులో ఐదుగురికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: పాతకక్షలు మనసులో పెట్టుకుని ఒకరిని గాయపర్చిన కేసులో ఐదుగురికి మూడు నెలల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పీసీఆర్ కోర్టు జడ్జి దుర్గారాణి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పవార్ కనకయ్య కళ్లలో కారంపొడి చల్లి 2019 ఏప్రిల్ 17న ఆయన బంధువులు ఒర్సు సురేశ్, పీరాజీ, గంగయ్య, సాయి, ఒల్లెపు సత్తయ్యలు దాడికి పాల్పడ్డారు. బాధితుడు మావల పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ముజాహిద్ కేసు దర్యాప్తు చేశారు. పీపీ నవీన్‌కుమార్ 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించినట్లు లైజన్ అధికారి తెలిపారు.

'నేతకానిలపై ఎమ్మెల్యే వైఖరి సరికాదు'

గుడిహత్నూర్: నేతకానిలను మాల నేతకానిలుగా పరిగణించాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదించడం సరికాదని తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో నేతకాని యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకానిలపై ఎమ్మెల్యే వైఖరి సరికాదన్నారు. వివేక్ వెంకటస్వామి చెన్నూరు ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు బెల్లంపల్లి ఎమ్మెల్యేగా, కుమారుడు పెద్దపల్లి ఎంపీగా నేతకానిల ఓటు బ్యాంకుతోనే గెలిచారనే విషయాన్ని మరిచి వారిపై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. సురేశ్, శంకర్, రవి, సంతోశ్, తిరుపతి, రజనీకాంత్ పాల్గొన్నారు.